క్లుప్తంగా

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్ అందజేత



కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

పరవాడ: మండలంలోని రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు మోటూరు వీరునాయుడుకు వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్మును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు కొలగాని సాంబ, వెల్ఫేర్ అసిస్టెంట్ స్వాతి కుమార్, వలంటీర్ వనజ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. వ్యక్తిత్వ వికాసం కోసం మూడు రోజుల పాటు నిర్వహించే వేసవి శిబిరాన్ని జీజీఎం సిన్హా, దీపికాలేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జీజీఎం సిన్హా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వ్యక్తిత్వ వికాసం, జీవిత నైపుణ్య విద్యకు పెద్ద ప్రాముఖ్యత ఉందన్నారు. వర్క్‌షాపులో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ (జెమ్) బాల్ భవన్ చిన్నారులు, డీఏలీసీ మహిళా సభ్యులకు శిబిరం నిర్వహిస్తున్నామని సిన్హా చెప్పారు. దీని ద్వారా వారిలో ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు విభూది బ్రదర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడలో కళాజాత నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం ద్వారా కలుగుతున్న అనర్థాలను వివరిస్తూ గ్రామాల్లో వీధి నాటకాలు వేశారు. ప్లాస్టిక్ సంచులు వాడొద్దు, జ్యూట్ సంచులు వినియోగించాలని ప్రజలకు వివరించారు.

కుక్కల దాడిలో నాటుకోళ్లు మృతి



గొర్లివానిపాలెంలో మృత్యువాత పడిన నాటుకోళ్లు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు గొర్లివానిపాలెం కుక్కల దాడిలో సుమారు 20 వరకూ నాటు కోళ్లు శుక్రవారం మృతి చెందాయి. గ్రామంలోని లెక్కల త్రినాథ్‌కు చెందిన షెడ్‌లో ప్రవేశించిన కుక్కలు కోళ్ల మెడలు కొరికి చంపేశాయని స్థానిక రైతులు తెలిపారు. కోళ్ల విలువ రూ.10 వేల పైనే ఉంటుందని చుట్టు పక్కల రైతులు చెప్పారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద తగ్గించాలని కోరుతున్నారు.

ఘనంగా పండిత సదస్యం

అల్లిపురం: ఇసుకు కొండపై వేంచేసిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా వేద బుత్విక్కులచే చతుర్వేదాల పారాయణం భాగంగా వేద మంత్రాలు శ్రావ్యంగా పఠనం చేయడంతో భక్తులు భక్తి పరవశులయ్యారు.

ఇల్లే ప్రకృతి వనం

- పెరటి తోటలపై పెరుగుతున్న ఆసక్తి
- పూలు, పండ్లు, అలంకార మొక్కల పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఇంటిని ప్రకృతి వనం చేసే మొక్కల పెంపకంపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటి వద్ద వివిధ రకాల మొక్కలు పెంచుతూ పరిసరాలను అందంగానే కాకుండా ఆరోగ్యంగా మార్చుకుంటున్నారు. ఒకప్పుడు ఆనందం, ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పార్కుల వెంట పరుగులు తీయాల్సి వచ్చేది. ఇపుడు ఎవరికి వారు తమ ఇంటి పెరటినే అందమైన ఉద్యానవనంగా తీర్చిదిద్ది అంతకంటే ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతంలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తమ ఇంటి ఆవరణాన్ని అందమైన తోటగా మలిచి ఆనందంతోపాటు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. వివిధ రకాల పూలు, పండ్లు, అలంకార మొక్కలను పెంచుతూ పచ్చదనాన్ని పెంపొందిస్తున్నారు. తమ శేషజీవితాన్ని వాటికే అంకితం చేస్తున్నారు. మొక్కల పెంపకం వల్ల వ్యాయామం చేసినట్లవుతుందని, స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందని వారు చెబుతున్నారు.

భరత్‌నగర్‌లో పచ్చని పొదరిల్లు



భరత్‌నగర్‌లోని శ్రీనివాసరావు ఇంటి మేడపై పెంచుతున్న ద్రాక్ష పాదులు, ఇతర మొక్కలు

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం భరత్‌నగర్‌లో బీఎస్ఎఫ్ రిటైర్డ్ ఉద్యోగి పూజారి శ్రీనివాసరావు స్థిరపడ్డారు. తన ఇంటినే పచ్చని పొదరిల్లులా మార్చేశారు. ఇంటి డాబాపై పలు రకాల పండ్ల మొక్కలు పెంచుతూ శభాష్ అనిపించుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, పైనాపిల్, జామ, మామిడి వంటి మొక్కలను పెంచుతున్నారు. ఇపుడు వాటిలో కొన్ని తొలగించి కొత్త మొక్కలు నాటుతున్నారు. ఇందుకోసం ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని వెచ్చించి చంటిబిడ్డల్లా వీటిని సాకుతున్నారు.

ఏపీఎస్ఈబీ కాలనీలో ఆకర్షణీయ మొక్కలు



ఏపీఎస్ఈబీ కాలనీలోని రమేష్ ఇంటి ఆవరణలో ఆకర్షిస్తున్న మొక్కలు, కొలువుదీరిన బుద్ధుడు

హెచ్‌పీసీఎల్‌లో సీనియర్ మేనేజర్‌గా అల్లు రమేష్ రిటైరైన తరువాత ఏపీఎస్ఈబీ కాలనీలో స్థిరపడ్డారు. ఆయన ఇంటి ఆవరణలో పలు మొక్కలను పెంచి అందంగా తీర్చిదిద్దారు. ఇంటి చుట్టు వేలాడేలా వాటిని సుందరగా ఏర్పాటు చేశారు. మేడపై గోళాల్లో పలు ఔషధ మొక్కలను పెంచడం ప్రారంభిస్తున్నారు. కొంత మందిని చూసి ప్రేరణతోనే ఇలా మొక్కలను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో చూడముచ్చటగా..



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని విష్ణుమూర్తి ఇంటి ఆవరణలో అందమైన మొక్కలు

ఎన్ఎస్‌టీఎల్ రిటైర్డ్ టెక్నికల్ అధికారి గిలకల విష్ణుమూర్తి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో నివసిస్తున్నారు. ఆయన ప్రవృత్తి బాడీ బిల్డింగ్. ఉద్యోగ సమయంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో బహుమతులు పొందారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ బాడీ బిల్డింగ్ మీట్‌లో మూడో స్థానం దక్కించుకున్నారు. ఇప్పటికీ కూడా తన ఫిట్‌నెస్ కోసం ప్రతి రోజూ వ్యాయామం చేయడం దినచర్యగా మారింది. ప్రస్తుతం తన ఇంటి అతి తక్కువ ఆవరణలోనే మొక్కలను పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉదయం, సాయంత్రం కొంత సమయం వెచ్చిస్తున్నారు.

మొక్కల పెంపకం సంతోషకరం



ఇంటి ఆవరణలో మొక్కలను పెంచడం సంతోషంగా ఉంది. ఇది నాకు ముందు నుంచే అలవాటే. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఇంట్లో వచ్చిన వ్యర్థాలతోనే వర్మీ కంపోస్టు చేసుకుని వాడుతుంటాను. అందుకే ఇక్కడి మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. వర్మీ కంపోస్టు తయారీపై తర్ఫీదు ఇస్తాను.

– పూజారి శ్రీనివాసరావు, భరత్‌నగర్



పూత దశకు వచ్చిన డ్రాగన్ ఫ్రూట్ మొక్క

కొందరి ప్రేరణతో ప్రారంభించా..



కొంత మంది ప్రేరణతోనే ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం ప్రారంభించారు. వీటిని సాకడం దినచర్యగా మారింది. కళకళలాడుతూ మొక్కలు కనిపిస్తుంటే ఆనందంగా ఉంటుంది. ఇంట్లో వాతావరణం బాగుంటుంది. రకరకాల మొక్కలు ఆరోగ్యానికి, ఆనందానికి దోహదపడతాయి.

– అల్లు రమేష్, ఏపీఎస్ఈబీ కాలనీ

ఇంటి రూపురేఖలు మారాయి



మొక్కల పెంపకం వల్ల మా ఇంటి వాతావరణమే మారిపోయింది. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటాను. అందం, ఆరోగ్యాన్ని ఇచ్చే మొక్కలు పెంచుతున్నాను. మొక్కలు అంటుకట్టి అడిగిన వారికి ఉచితంగా ఇస్తున్నాను. ఇంట్లో ఏమాత్రం స్థలం ఉన్నా మొక్కలను పెంచాలని కోరుతున్నాను.

– గిలికల విష్ణుమూర్తి, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్

జేవీకే కిట్ల పరిశీలన



జగనన్న విద్యా కానుక స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక-4(జేవీకే) స్టాక్ కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. రమేష్ నాయుడు శుక్రవారం సందర్శించారు. కానుకలోని బెల్ట్‌లు,షూ,సాక్స్,నోట్ పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల నాణ్యతను పరిశీలించారు.స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఎంఈవో ఎస్. అప్పలరాజుకు సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది,సీఆర్పీలు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ఛత్రపతి ఎనలేని కృషి



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పరవాడ: హిందూధర్మ పరిరక్షణకు ఛత్రపతి శివాజీ ఎంతో కృషి చేశారని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ రామాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ సామ్రాజ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందువులంతా హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతీ పౌర్ణమికి దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి, వారం వారం భజన, ఏకాదశి రోజు నగర సంకీర్తన, భగవంతుడిని పురవీధుల్లో ఊరేగించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు రెడ్డి రమణమ్మ, పార్వతి, నూకాలమ్మ, గంగరాజు, అచ్చిబాబు, లోవరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణతో లాభాలు



వాడచీపురుపల్లి రైతు గ్రూప్‌నకు ట్రాక్టర్ అందజేసిన రామారావు

పరవాడ: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన యంత్రపరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు పిలుపునిచ్చారు. అనకాపల్లి మున్సిపల్ స్టేడియం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాడచీపురుపల్లి రైతు గ్రూపునకు మంజూరైన ట్రాక్టర్‌ను రామారావు రైతులకు శుక్రవారం అందజేశారు. పరవాడ మండలంలో 5 గ్రూపులకు యంత్రపరికాలను మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఏఈవో ఎం.నరసింహమూర్తి, గ్రూప్ సభ్యులు కె.వెంకటరమణ, జి.సాధురావు, కె.తాతాజీ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రెండు జాతాలు గత నెల 31న ప్రారంభమయ్యాయని తెలిపారు. నగరాలు శుభ్రపరచడం, మంచినీళ్లు, విద్యుత్ తదితర ప్రజలకు అందించే సేవల్లో మున్సిపల్ కార్మికులు అగ్రభాగాన నిలుస్తున్నారని చెప్పారు. అటువంటి వారిని పర్మినెంట్ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 తర్వాత రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో సిటు నాయకులు పి. వెంకట్‌రెడ్డి, నూకరాజు, రాజు, రమణ, రత్నం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌డీటీ జర్నల్ ఆవిష్కరణ



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం నూతనంగా ప్రారంభించిన ప్రత్యేక సంచిక ప్రగ్యను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సంచికలో వివిధ ఆర్టికల్స్, ఇంటర్వ్యూలు, పుస్తక సమీక్షలు ప్రచురిస్తారు. అదే విధంగా పరిశ్రమల్లో నూతన విధానాలను దీనిలో చర్చిస్తారు. తొలి సంచికను వీసీ ప్రసాదరెడ్డికి విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఒ.ఆర్.ఎం.రావు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు సైతం ప్రత్యేక సంచికను బహూకరించారు. విశాఖ ఐఎస్‌టీడీలో 600 మందికిపైగా సభ్యులు ఉన్నారు.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించాలి

మురళీనగర్(విశాఖ ఉత్తర): హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 పవన్‌కుమార్ జాస్తి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995 సంబంధించిన పింఛన్‌దారులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. https:// unifiedportal& mem. epfindia. gov. in వెబ్‌సైట్‌లో ఫారాలు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు.

వరాహ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై వరాహస్వామి ఆలయ నిర్మాణానికి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితుడు త్రిదండి చిన జీయర్‌స్వామి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమాన్ని వెంకటాద్రి అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎంపీడీవో వసంత బాధ్యతల స్వీకరణ




నూతన ఎంపీడీవో వసంతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: పెందుర్తి ఎంపీడీవోగా శుక్రవారం కె. వసంత బాధ్యతలు స్వీకరించారు. ఎస్.రాయవరం నుంచి బదిలీపై వచ్చిన ఆమె ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న వెంకటరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆమెకు పలువురు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లాలోని 24 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 2,041 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,708 మంది పరీక్షకు హాజరయ్యారు. 333 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 14 సెంటర్లును తనిఖీ చేశాయి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'జన్ భాగీదరి'ని విజయవంతం చేయండి



జన్ భాగీదరి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో అప్పలరాజు తదితరులు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జి-20 జన్ భాగీదరి కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు దొడ్డి లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఎస్ .అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పునాది అభ్యసన మరియు సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ ఉపాధ్యాయులు ,విద్యార్థులు కలిసి భాష,గణితంలో కొన్ని కృత్యాలు చేసి వాటిని రాష్ట్ర స్థాయిలో గూగుల్ ట్రాకర్ లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. అందులో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలని తెలియజేశారు. ప్రతి పాఠశాలలో తయారు చేసిన టీఎల్ఎంను ప్రదర్శించాలని,సాంస్కృతిక కార్యక్రమాలు,పాఠశాల సంసిద్ధత మేళాలు,సాంకేతిక వినియోగం,ఎస్ఎంసీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆడియో విజువల్‌ను ఉపయోగించి పునాది అభ్యసన సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడం,కథలు చెప్పడం, క్విజ్,పద్యాలు, గోడమీద చిత్రాలు,వీధి నాటకాలు,బుర్రకథలు వంటివి ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,ఎంఆర్సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు,పేరెంట్స్ కమిటీ సభ్యులు,విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎంప్లాయిమెంటు అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్ఎన్ లేబరేటరీస్ హైదరాబాద్, హెటిరో, దక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్ ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, టీజేఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్‌తో పాటు పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 560 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 1,013 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 305 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధా చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటే కార్యక్రమం పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలో వేప, రావి, ఉసిరి, నేరేడు, కొబ్బరి, మామిడి, తదితర ప్రాణవాయువుని అధికంగా అందించే మొక్కలను నాటనున్నారు. వర్సిటీలోని ప్రధాన రహదారుల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.శశిభూషణరావు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఎంప్లాయిమెంట్ బ్యూరో చీఫ్ ఆచార్య పి.అర్జున్, పరిశోధకులు మోహన్‌బాబు, శ్రీకాంత్, వినోద్ మాథ్యుస్, రాజ్‌కుమార్, కల్యాణ్, అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.